క్లుప్తంగా

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

భైంసాటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని డీఎం అమృత సూచించారు. ఈ మేరకు గురువారం భైంసా డిపో ఆవరణలో హైర్‌బస్ డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులే సంస్థకు ముఖ్య ఆధారమని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రయాణికులు కోరిన చోట బస్సు ఆపాలని.. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు.

ముగిసిన హరినామ సప్తాహం

ముధోల్: మండలంలోని చించాల గ్రామంలో ఏడు రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం గురువారం ముగిసింది. ఉదయం, సాయంత్రం హరినామస్మరణతోపాటు రాత్రి భజన దీండుల ఆధ్వర్యంలో కీర్తనలు కొనసాగాయి. హనుమాన్ ఆలయంలో విఠల రుక్మాబాయి చిత్రపటాల వద్ద పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

టీఎన్జీవోస్ నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

భైంసా: టీఎన్జీవోస్ భైంసాశాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని సంఘభవనంలో ఎన్నికల అధికారి శ్రీరాం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులుగా ఎస్.శ్రీహరి, కార్యదర్శిగా ఆకాశ్, ఉపాధ్యక్షులుగా నాగోరావు, కవిత, కోశాధికారిగా ముజాయిద్, సంయుక్త కార్యదర్శిగా పాండురంగ, గాయత్రి, ప్రచార కార్యదర్శిగా నరేశ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గాన్ని సన్మానించారు.

చిన్నారులకు అన్నప్రాసన

కుభీర్: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఎల్ఎంసీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ప్రతినెల ఒకటో తేదీన గర్భిణులు, పిల్లల బరువు లెక్కిస్తారని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ సత్యశీల, లబ్ధిదారులు ఉన్నారు.

'షర్మిల పాదయాత్ర జయప్రదం చేయాలి'

ఖానాపూర్: నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట నుంచి ప్రారంభమయ్యే వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు పానగంటి నరేశ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రకు తరలి రావాలని కార్యకర్తలను కోరారు. సమావేశంలో మచ్చ శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులున్నారు.

అనాథకు అంత్యక్రియలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శ్మశానవాటికలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించిన అనాథకు నిర్మల హృదయ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇందులో తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటకారి సాయన్న, డాక్టర్ వేణుగోపాల్, జాన్డీర్ ట్రాక్టర్ షోరూం యజమాని రవీందర్, ముదిరాజ్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు గణేశ్, సభ్యులు పాల్గొన్నారు.

మహోర్‌కు పాదయాత్ర

భైంసారూరల్: తానూరు మండలం మచ్కల్ గ్రామానికి చెందిన భజన బృందం పాదయాత్రగా మహారాష్ట్రలోని మహోర్‌కు బయలుదేరారు. ఈమేరకు గురువారం మండలంలోని దేగాం గ్రామానికి చేరుకున్నారు. ఏటా 30 మంది వరకు మహోర్‌లో జరిగే దత్త జయంతి ఉత్సవాల్లో పాల్గొంటామని పలువురు బృందం సభ్యులు పేర్కొన్నారు.

పన్నులు వసూలు చేయాలి

కుంటాల: ఇంటిపన్నులు సకాలంలో వంద శాతం వసూలు చేయాలని డీఎల్‌పీఓ శివకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కల్లూరు, కుంటాల గ్రామపంచాయతీల్లో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా 70 శాతం బిల్లులు వసూలయ్యాయని.. లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. హరితనిధి ద్వారా ఇంటి, దుకాణ సముదాయాల పన్నులతోపాటు అదనంగా రూ.300 చెల్లించాలని కోరారు. వారి వెంట ఎంపీఓ రహీం, పంచాయతీ కార్యదర్శులు రాజబాపు, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

వరి పంట పరిశీలన

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో తెగులు సోకిన వరి పంటలను ఏవో గణేశ్ పరిశీలించి మాట్లాడారు. కాండం తొలుచు పురుగు నివారణకు రైతులు వరిలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నారుమడిలో వేయకుంటే 15 రోజుల వరి పైరులో ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు, 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు వేయాలన్నారు. ఆయన వెంట ఏఈవో భూమేశ్ ఉన్నారు.



చల్లని తల్లి.. గజ్జలమ్మ



- కుంటాల ఇలవేల్పు పూజలందుకుంటున్న వైనం
- కలలో వచ్చి.. కోనేరులో వెలసిన అమ్మవారు
- ఊరందరికీ కొంగు బంగారం

కుంటాల : ఉమ్మడి జిల్లాలో ప్రతీ పల్లెకూ ప్రత్యేకత ఉంటుంది. సంస్కృతి సంప్రదాయాలకు గ్రామాలు పుట్టినిళ్లు. ఆధునిక పరిజ్ఞానం గ్రామాలకు విస్తరిస్తున్నా ఊరి ఉనికి ఏ మాత్రం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిర్మల్ జిల్లా కుంటాల గ్రామంలో గజ్జలమ్మను తమ ఇలవేల్పుగా కొలుస్తూ ఊరి ప్రత్యేకతను నిలుపుకుంటున్నారు. సాధారణంగా మనం ఏ ఊరికి వెళ్లినా.. ఇంటి పేరో.. వ్యక్తి పేరు చెప్పగానే అడ్రస్ చెప్పేస్తారు. కానీ కుంటాలకు వెళ్లి.. ఇంటి పేరు, వ్యక్తి పేరు చెప్పి అడ్రస్ అడిగితే.. ఎత్తుగా ఉంటాడా..? పొట్టిగా ఉంటాడా..? నల్లగా ఉంటాడా..? పెద్దోడా..? చిన్నోడా..? నడిపోడా..? ఇలాంటి ప్రశ్నలు తిరిగి మనకు ఎదురవుతాయి. ఎందుకంటే ఊళ్లో ఒకే పేరు ఉన్నవారు పదుల సంఖ్యలో ఉన్నారు. ఊరి ఇలవేల్పు అయిన గజ్జలమ్మ తమను చల్లగా చూస్తుందన్న నమ్మకంతో అమ్మవారి పేరులోని అక్షరాలు కలిసేలా పేర్లు పెట్టుకుంటున్నారు. అందుకే కుంటాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కుంటాల గ్రామంలోని గజ్జలమ్మ ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. గ్రామానికి చెందిన మూసరి వంశస్తులు నిత్యం వేటకి వెళ్లేవారు. ఓ రోజు ముత్యం అనే గ్రామస్తునికి గ్రామ సమీపంలోని చిన్న కోనేరులో అమ్మవారి విగ్రహం కనిపించింది. అదేరోజు రాత్రి ముత్యం కలలోకి వచ్చి తాను ఢిల్లీ పక్కన ఉన్న బజాపురం నుంచి వచ్చానని, తనను ప్రతిష్ఠించి కొలిస్తే అంతా మంచి జరుగుతుందని గజ్జలమ్మ చెప్పిందట. మరుసటి రోజు ముత్యం గ్రామస్తులకు తన కలలో వచ్చిన విషయాన్ని వివరించారు. దీంతో అంతాకలిసి కోనేటిలో ఉన్న విగ్రహాన్ని ఊరిబయట ప్రతిష్ఠించారు. అమ్మవారి పేరును ఊళ్లో పుట్టిన బిడ్డలకు పెడుతుండడంతో గజ్జలమ్మ ఊరికి ఇలవేల్పుగా మారింది.

ప్రస్తుతం ట్రెండు మారడంతో బారసాల సందర్భంగా మొదటగా అమ్మవారి పేరుతో పిలిచి తర్వాత కొత్తపేర్లు పెడుతున్నారు. పిల్లలను చల్లగా చూస్తుండడంతో ఆలయం వద్ద బెల్లం తులాభారం వేస్తున్నారు. తలనీలాలు సమర్పిస్తున్నారు.

నైవేద్యంలో ప్రత్యేకత...

ఏటా శీతాకాలంలో ద్యావల దండుగ సందర్భంగా రాత్రి వండిన నైవేద్యం ఉదయం శ్రీగజ్జలమ్మకు సమర్పిస్తారు. సత్యగంగ పౌర్ణమిని పురస్కరించుకుని సారంగపూర్ మండలం పొంగ్రి గోదావరి వద్దకు వెళ్లి అమ్మవారి నగలను శుద్ధి చేస్తారు. అప్పటి నుంచి ఆలయంలో పూజలు ప్రారంభం అవుతాయి. జాతర సందర్భంగా ఉల్లిగడ్డలు, వాము, పుట్నా లు, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ఆశీర్వాదం తీసుకుంటారు. ఈ వేడుక నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆడబిడ్డలు గ్రామానికి వస్తారు.

అమ్మవారి అక్షరం కలిసేలా పేర్లు..

కుంటాలలో గజ్జలమ్మ కొలువై ఉండడంతో ఏళ్లగా పుట్టిన పిల్లలకు అమ్మవారి అక్షరం కలిసేలా పేర్లు పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. మగవాళ్లయితే గజ్జారాం, గజ్జన్న, గజేందర్, ఆడవాళ్లయితే గజ్జవ్వ, గజ్జలమ్మ, ఇలా వందల సంఖ్యలో పేర్లు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. కుంటాలలో 4 వేలకుపైగా జనాభ ఉండగా ఇందులో సగం మందికి అమ్మవారి పేరు, అమ్మ పేరులోని అక్షరం కలిసే పేర్లు ఉన్నాయి.

వార్షికోత్సవం ప్రారంభం..

గజ్జలమ్మ ఆలయాన్ని మూడేళ్ల కిందట రూ.50 లక్షలతో అభివృద్ధి చేశారు. ఇందుకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి సహకారం అందించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి భగవతి ప్రార్థన, విశేష సంకల్పం, మహాగణపతిపూజ, పుణ్యావచనము, యాగశాల ప్రవేశం, సంస్కారం, వాస్తు, క్షేత్ర పాలక, నవగ్రహ పూజ, యోగిని, కర్సరీ, సర్వతోభద్ర మండల స్థాపన, అగ్ని ప్రతిష్ట, స్థాపిత దేవతాహోమం, రథ జలాభిషేకం, సాయంత్రం కుంకుమార్చన, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. శుక్రవారం నిత్యనిధి, యజ్ఞం, గజ్జలమ్మ కళ్యాణం, రథోత్సవం, హారతి, మంత్రపుష్పం ఉంటుంది. శనివారం నిత్యనిధి, మహాపూర్ణ హారతి, కుంభాభిషేకం చేస్తారు.

మా తాత కలలో వచ్చిన అమ్మవారు



మా తాతయ్య మూసరి ముత్యం నిత్యం వేటకు అడవికి వెళ్లే వారు. ఒక రోజు మడుగులో విగ్రహం కనిపించి , గజ్జలమ్మ కలలో వచ్చి ప్రతిష్ఠించాలని కోరిందట. గ్రామస్తులంతా కలిసి ఆలయం ఏర్పాటు చేశారు. – మూసరి నాగేష్, ఆలయ అర్చకుడు

కోర్కెలు తీర్చే తల్లి..



మాఊరితోపాటు తనను నమ్ముకున్న భక్తులను ఎప్పుడు రక్షిస్తుందని మేం నమ్ముతాం. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా గజ్జలమ్మ విరాజిల్లుతోంది. ప్రతీ ఆదివారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తాం. పిల్లలకు తులాభారాలు, తలనీలాలు అర్పించి మొక్కులు చెల్లిస్తాం. – జక్కని గజేందర్, గురుస్వామి కుంటాల

అమ్మ దయ ఉంటే చాలు



మా గ్రామంలో ఉన్న గజ్జలమ్మ దేవత అంటే మాకెంతో ఇష్టం. మా తల్లిదండ్రులు తమ్ముడి పేరు గజేందర్ అని, నా పేరు గజ్జవ్వ అని పెట్టారు. మాది అందకూర్ గ్రామం ప్రతి నెలలో ఓ ఆదివారం గజ్జలమ్మ గుడికి వచ్చి దర్శించుకుంటా. అమ్మ దయ ఉంటే అంతా మేలే జరుగుతుంది. – కన్నం గజ్జవ్వ, కుంటాల

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



బంగల్‌పేట్ పీహెచ్‌సీ ఎదుట ఆశవర్కర్ల ధర్నా

నిర్మల్‌టౌన్: అసెంబ్లీ సమావేశాల్లో తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆశాల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు సుజాత అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని రాంనగర్, బంగల్‌పేట్ పీహెచ్‌సీల ఎదుట ఆశవర్కర్లు గురువారం ధర్నా చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, పలువురు ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ఆశవర్కర్లు నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగామణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు సుజాత, ఇంద్రమాల, శ్రీలత, శకుంతల, లక్ష్మి పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ఆశవర్కర్లు నిరసన తెలిపారు. యూనియన్ మండలాధ్యక్షురాలు సరిత మాట్లాడుతూ ఇటీవల విధులకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఖర్బాలాకు చెందిన ఆశ కార్యకర్త గాడేకర్ ఉజ్వల కుటుంబానికి రూ.20 లక్షలతోపాటు వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ముత్తవ్వ, గోదావరి, తానూశ్రీ, లక్ష్మి, అనిత, సునీత, సంగీత ఉన్నారు.

నర్సాపూర్(జి): తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆశవర్కర్లు మండలకేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసన తెలిపారు.

కుభీర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మండలంలోని వివిధ గ్రామాల ఆశవర్కర్లు వినతిపత్రం అందజేశారు. అనంతరం వినతిపత్రాన్ని వైద్యాధికారి నరేశ్‌కు అందించారు.

దస్తురాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి కామేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, ఆశవర్కర్లు అనసూర్య, మంజుల, సజాత, గోదావరి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

పెంబి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశవర్కర్లు వినతిపత్రం అందజేశారు. గంగామణి, వినోద, సువర్ణ, లావణ్య, మమత, జ్యోతి, మంగా, వినోద పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవం



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలో శ్రీ గజ్జలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేసినేని సుశీల,గంగారావు అన్నదానం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: భైంసాకు చెందిన బాజీరావుకు రూ.32 వేలు, లక్ష్మీబాయికి రూ.27వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. గురువారం మండలంలోని దేగాంలో తన నివాసంలో లబ్ధిదారుల కుటుంబసభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అందించారు.

విఠల్‌రెడ్డిని కలిసిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే..

ఈనెల 5న మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభ పరిశీలనకు వెళ్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న దేగాం గ్రామంలోని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి.. రామన్నను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. భైంసాలోని బొర్ర గణేశ్ నుంచి బాబుల్‌గాం గ్రామం వరకు రోడ్డు సౌకర్యం కల్పించడంతో కిసాన్‌గల్లీ రైతులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం తమ డిమాండ్లు పరిష్కరించాలని డివిజన్‌లోని వీఆర్ఏలు, సెకండ్ ఏఎన్ఎంలు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. చిన్నన్న, కుంట కాశీనాథ్, మారుతిపటేల్, ఏఎన్ఎం రాజకళ, ఏఎన్ఎంలు, వీఆర్ఏలు ఉన్నారు.

ముజ్జిగి మల్లన్న పల్లకిని దర్శించుకున్న మంత్రి

నిర్మల్‌టౌన్: నిర్మల్‌రూరల్ మండలంలోని ముజ్జిగి మల్లన్నస్వామి పల్లకి గురువారం జిల్లా కేంద్రంలోని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నివాసానికి చేరుకొంది. ఇందులో భాగంగా మంత్రి దంపతులు తన నివాసంలో మల్లన్నస్వామి పల్లకిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించారు. డిసెంబర్‌లో పౌర్ణమి రోజున ప్రారంభమైన పల్లకిసేవ మాఘ పౌర్ణమిన మల్లన్న ఆలయానికి చేరుకుంటుంది. ఈనెల 4నస్వామి వారి కల్యాణం, 6న రథోత్సవం, 8న అగ్నిగుండ ప్రవేశంతో పాటు, జాతర జరుగుతుందని ఆలయ పూజారి తెలిపారు. గండి రామన్న ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన నాయకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఆదిలాబాద్ జిల్లాలో ఇస్తున్నట్లు.. నిర్మల్ జిల్లాలోనూ తమకు వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేసే దినసరి కార్మికులు గురువారం కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఆదిలాబాద్‌లోని మున్సిపల్, నాన్‌మున్సిపల్, ఏజెన్సీ ఏరియాలోని వారికి వేతనాలు ఇస్తున్నట్లు నిర్మల్ జిల్లాలోనూ చెల్లించాలని కోరారు. అంతకముందు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజలింగు, వసంత్, తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆమ్ ఆద్మీ నాయకులు

నిర్మల్‌టౌన్: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వరుణ్‌రెడ్డిని కలెక్టరేట్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ హైదర్, కార్యకర్తలు మొయిజ్‌ఖాన్, వరుణ్‌సాయి, సాజిద్, వాజీద్, తాబ్రెస్ జైన్, ముహమ్మద్ మూసేబ్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం

నిర్మల్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ఏటా బడ్జెట్లో ఉపాధిహామీ పథకానికి నిధుల కేటాయింపులో కోత విధిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి అన్నారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం నూతన బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. దీంతో కూలీలకు ఇబ్బంది అవుతుందని.. ప్రభుత్వం పునరాలోంచి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జాన్ పాల్, అశోక్, డి.పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: గ్రామీణ పేదలకు నష్టం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి భూక్య రమేశ్ అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా రాస్తారోకో చేసి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు బీమేశ్, చిన్నయ్య, తదితరులు ఉన్నారు.

'అధికార దుర్వినియోగానికి పాల్పడిన ముషరఫ్'

భైంసాటౌన్: జిల్లా కలెక్టర్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన ముషరఫ్ అలీ ఫారూఖీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని భైంసా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్‌అహ్మద్ గురువారం ఓ వీడియో సందేశంలో ఆరోపించారు. ఆయన తన అనుమతి లేనిదే రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారన్నారు. తనకు అనుకూలంగా ఉన్న అధికారులతో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ, వక్ఫ్ భూములను అక్రమ మార్గంలో బదలాయించడంతోపాటు నకిలీ డీ–1 పట్టాలు సృష్టించారన్నారు. మున్సిపల్ కమిషనర్‌ను అకారణంగా సరెండర్ చేశారని ఆరోపించారు. ఈ విషయమై గత సీఎస్‌తోపాటు ప్రస్తుత సీఎస్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఆయన అక్రమాలపై ఆధారాలు బయటపెడతామని అన్నారు. న్యాయం కోసం హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రికెట్ పోటీలు పరిశీలన

భైంసాటౌన్: యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమని బీజేపీ నాయకులు పవార్ రామారావ్‌పటేల్ అన్నారు. గురువారం పార్డి(బి) బైపాస్‌రోడ్‌లో జరుగుతున్న సయ్యద్ ఇర్ఫాన్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు జ్ఞాపిక అందజేశారు.

బోనాల పండుగ

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం చలి బోనాల పండుగ నిర్వహించారు. పుష్య అమావాస్య నుంచి మాఘ శుద్ధ పౌర్ణమి వరకు జరిగే చలిబోనాల పండుగను ప్రతీ ఆది, గురువారాల్లో నిర్వహిస్తారు.

కరాటే శిక్షణ తరగతులు

ఖానాపూర్: ఆత్మరక్షణకు బాలికలు తప్పనిసరిగా కరాటే సాధన చేయాలని శిక్షకుడు ఆరిఫ్ అన్నారు. గురువారం మస్కాపూర్ కేజీబీవీలో విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులు నిర్వహించారు. పాతఎల్లాపూర్, సత్తన్‌పల్లి జెడ్పీఎస్ఎస్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పంటలు పరిశీలించిన విద్యార్థులు

భైంసాటౌన్: క్షేత్ర పర్యటనలో భాగంగా పట్టణంలోని సుభద్రవాటిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు గురువారం శివారులోని పంటలు పరిశీలించారు. ఆహార, వాణిజ్య పంటల సాగుపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కె)కు చెందిన దాసరిగౌండ శ్రీనివాస్ అనే యువకుడు తన పుట్టినరోజును పురస్కరించుకొని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయుడులక్ష్మణ్, ఎస్ఎంసీ చైర్మన్ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

భూమిపూజ

లోకేశ్వరం: మండలంలోని నగర్‌తండా గ్రా మంలో గురువారం సంత్ రామ్‌రావ్ మహారా జ్ విగ్రహ నిర్మాణానికి బాబుసింగ్ భూమి పూజ చేశారు. నిర్మాణానికయ్యే ఖర్చును భ రిస్తామని తండావాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తండావాసులు రాథోడ్ గంగారాం, సురేశ్, బాలిరాం, గణేశ్, నాగేష్, దేవిలాల్, సుభాశ్, పకీర్ పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామ సమీపంలో వంతెన వద్ద గురువారం ఎస్సై సాయికుమార్ వాహనాలు తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. ఏఎస్సై దిగంబర్‌రావు, పోలీసులు ఉన్నారు.

రేపు ఎడ్‌బిడ్ మల్లన్న జాతర

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో ఈనెల నాలుగో తేదీ నుంచి మల్లన్న జాతర ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మల్లన్న పల్లకీని నియోజకవర్గంలో ఊరేగిస్తున్నారు. గురువారం ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. 4న కల్యాణం, 5న చల్లని అంబళ్ల, సోమవారం దేవుణి పల్లకి ఊరేగింపు, మంగళవారం కుస్తీ పోటీలు, రాత్రి అగ్నిగుండ ప్రవేశం, బుధవారం ఆడపడుచుల జాతర, అంబలికుండ ఇంటికి తీసుకురావడం కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

త్రీఫేజ్ విద్యుత్ వేళలో మార్పులు

దస్తురాబాద్: మరమ్మతుల నేపథ్యంలో త్రీఫేజ్ కరెంట్ సరఫరా వేళల్లో మార్పులు చేయనున్నట్లు ఇన్‌చార్జి ఏడీఈ కేశెట్టి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కడెం మండలంలోని నచ్చనఎల్లాపూర్ గ్రామ సమీపంలో జరుగుతున్న తీగల మరమ్మతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మరమ్మతుల కారణంగా ఆరు రోజుల పాటు త్రీఫేజ్ కరెంట్ రాత్రి 11గంటల నుండి ఉదయం తొమ్మిది గంటల వరకు ఇస్తామని.. కడెం, దస్తురాబాద్, బుట్టాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని రైతులు సహకరించాలని కోరారు.

'కంటివెలుగు' పరిశీలించిన చైర్మన్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్ కాలనీలో కంటివెలుగు వైద్యశిబిరాన్ని గురువారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ఈసందర్భంగా వైద్యులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్కాకుల నరహరి, పోశెట్టి, సుదర్శన్, సహదేవ్, బాపురావ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్‌కాలనీ శ్రీ ఓంకారేశ్వర మందిరాన్ని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ సందర్శించారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పొన్కల్‌లో కంటివెలుగు ప్రారంభం

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని వైద్యాధికారి నయన రెడ్డి ప్రారంభించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యులు అరుణ్‌కుమార్, సర్పంచ్ భూమేశ్వర్, గంగారెడ్డి, ఎంపీడీఓ రమేశ్, కార్యదర్శి సాయి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గిరిజనులపై కేంద్రం చిన్నచూపు

ఖానాపూర్: బీజేపీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో గిరిజనులకు చిన్నచూపు చూసిందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునేలా బడ్జెట్ రూపొందించింది తప్ప.. ఈ బడ్జెట్‌తో రాష్ట్రంలోని గిరిజనులకు ఎలాంటి ఉపయోగం లేదని పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899